సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 21 | జనవరి | 2025



రెండు కిలోమీటర్లు.. మూడున్నర గంటలు

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండలో లక్ష డప్పులు.. వేల గొంతుకల సన్నాహక మహా ప్రదర్శన జరిగింది. - 8లో▸



కొండాయి బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

కొండాయి జంపన్నవాగు బ్రిడ్జికి మోక్షం కలగడం లేదు. శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభం కావడం లేదు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

30.1^0 / 16.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ, రాత్రి చలిగా ఉంటుంది.


న్యూస్‌రీల్

కార్మికులను పట్టించుకోని వైద్యులు




భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఏరియా ఆస్పత్రికి వెళ్లిన కార్మికులను వైద్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య పరీక్షల నిమిత్తం ఏరియా ఆస్పత్రికి వెళ్తే ఆస్పత్రిలో యంత్రాలు పనిచేయక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఈసీజీ యంత్రం పనిచేయడం లేదని.. కార్పొరేట్ ఆస్పత్రికి పంపిస్తున్నారన్నారు. అక్కడికి వెళ్తే ఎలాంటి సమస్య లేదని తిరిగి పంపిస్తున్నట్లు తెలిపారు. దీంతో కార్మికులు మూడు నాలుగు రోజులు వేతనాలు కోల్పోతున్నారని ఆరోపించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కార్మికులకు యాజమాన్యం మెడికల్ టెస్ట్ నిర్వహిస్తుందని.. ఈ టెస్టులకు ఒక్క రోజు యాజమాన్యం వేతనంతో కూడిన సెలవు ఇస్తుందన్నారు. యంత్రాలు పనిచేయకపోవడంతో కార్మికులు మరో రెండు రోజులు సెలవులు తీసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఆస్పత్రుల్లో మెరుగైన యంత్రాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, బాపు, జయశంకర్, శ్రీధర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా సూర్యఘర్ పథకం అమలు



కాటారం: పీఎం సూర్యఘర్ పథకం అమలుకు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ మల్చూర్ సూచించారు. సూర్యఘర్ పథకం అమలుపై కాటారం మండలకేంద్రంలోని రైతువేదికలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కాటారం గ్రామం మోడల్ విలేజ్‌గా ఎంపికైందన్నారు. గ్రామంలో 1,080 విద్యుత్ కనెక్షన్లు ఉండగా ప్రతీ ఇంటికి సూర్యఘర్ పథకంలో భాగంగా ఉచితంగా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ పథకం ఏర్పాటు కోసం సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తారని లబ్ధిదారులు తమ విద్యుత్ బిల్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ సర్వే సిబ్బందికి అందజేయాలని సూచించారు. మోడల్ విలేజ్‌లో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రణాళికతో ముందుకెళ్తునట్లు ఎస్ఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ రెడ్కో డీఎం మహేందర్, ఏడీఈ నాగరాజు, సబ్ ఇంజనీర్ ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



కాటారం: ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం(ఎన్‌క్యూఏఎస్) సభ్యులు డాక్టర్ ఆనంది సత్యకుమార్, డాక్టర్ కిరణ్ పాటిల్ సూచించారు. మహాముత్తారం మండలం బోర్లగూడెంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ద్వారా అందుతున్న వైద్యసేవలు, మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి రోజు వారి రోగుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రులు, వెల్‌నెస్ సెంటర్‌లలో వైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆవరణలో పరిశుభ్రత ఉండేలా చూసుకోవాలన్నారు. బృందం సభ్యుల వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారిణి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ప్రమోద్, స్థానిక వైద్యులు డాక్టర్ సందీప్, క్వాలిటీ మేనేజర్ శరత్, డీపీఓ చిరంజీవి, డీడీఎం మధుబాబు, తదితరులు ఉన్నారు.

లెక్క పక్కాగా..

జిల్లాలో కొనసాగుతున్న పశుగణన



- ఇప్పటివరకు 70శాతం మేర పూర్తి
- ఫిబ్రవరి 28లోపు పూర్తయ్యే అవకాశం

కాటారం: జిల్లాలో పశుజాతుల లెక్కింపు ప్రక్రియ పక్కాగా కొనసాగుతోంది. పశువైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి ఆయా జాతులకు సంబంధించిన పశువుల వివరాలను నమోదు చేస్తున్నారు. పశుజాతులకు సంబంధించిన సంక్షేమ పథకాల రూపకల్పన చేయడంతో పాటు పశుపోషకుల ఆర్థిక పరిపుష్టిని అంచనా వేసేందుకు పశుగణన ఉపయోగకరంగా ఉంటుంది. దీని కోసం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వ ఆదేశాలతో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పట్టణాలు, గ్రామాల్లో పశుజాతుల లెక్కింపు చేపడుతున్నారు. 2018–19 సంవత్సరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లు పూర్తి కావడంతో రెండు నెలల క్రితం పశుగుణన సర్వే ప్రారంభించారు. జిల్లాలో 12 మండలాలు ఉండగా 241 గ్రామపంచాయతీల్లో పశుగుణన కొనసాగుతోంది. ఇప్పటివరకు 70శాతం మేర పశువుల లెక్కింపు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఫిబ్రవరి 28లోపు పశుగణన పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు విధించగా నిర్దేశిత సమయంలోగా జిల్లాలో లక్ష్యం పూర్తి చేయాలనే ఉద్దేశంతో పశువైద్యశాఖ అధికారులు, సిబ్బంది ముందుకెళ్తున్నారు.

61మంది ఎన్యుమరేటర్లు..

జిల్లాలో అక్టోబర్ 25న పశుగణన సర్వే ప్రారంభమవగా 61మంది ఎన్యుమరేటర్లు ఇంటింటా తిరిగి పశువుల లెక్కింపు చేపడుతున్నారు. పశుగణన సర్వే పర్యవేక్షణ కోసం 10మంది సూపర్‌వైజర్లు, జిల్లాస్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆధ్వర్యంలో సర్వే కొనసాగుతుండగా ఎప్పటికప్పుడు వివరాలను రాష్ట్రస్థాయి అధికారులకు అందజేస్తున్నారు. పశువైద్యశాఖలో సిబ్బంది కొరత ఉండగా గోపాలమిత్రల సహాయం తీసుకొని సర్వేను ముందుకు నడిపిస్తున్నారు.



మహాముత్తారం మండలంలో పశుగణన సర్వేను పరిశీలిస్తున్న డీవీహెచ్ఓ కుమారస్వామి(ఫైల్)

జిల్లా సమాచారం..

మండలాలు	12
గ్రామపంచాయతీలు	241
పశువుల సంఖ్య (2018-19) సర్వే ప్రకారం	9,28,460
పశువుల సంఖ్య (2024-25) అంచనా	11 లక్షలకు పైగా

పశుధన్ యాప్‌లో నమోదు..

పశుగణన 1919వ సంవత్సరంలో ప్రారంభమవగా ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణన లెక్కిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు 20సార్లు పశుగణన చేపట్టారు. మునుపెన్నడు లేని విధంగా తొలిసారి పశుగణన ఆన్‌లైన్ ద్వారా చేపడుతున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన పశుధన్ అనే యాప్ ద్వారా 16 పశుజాతులకు సంబంధించిన వివరాలను ఎన్యూమరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆవులు, ఎద్దులు, గేదె జాతి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, పెంపుడు కుక్కలు, ఒంటెలు, పొట్టి గుర్రాలు, కుందేళ్లు, ఏనుగులు, కోళ్ల రకాలను లెక్కిస్తున్నారు. పశుపోషణలో ఉన్న రైతులు, కుటుంబాల వివరాలను సేకరించడంతో పాటు పశువుల వయసు సైతం సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి స్టిక్కరింగ్ చేస్తున్నారు.

నిర్ణీత గడువులోగా లెక్కింపు పూర్తి..



జిల్లాలో రెండు నెలలుగా పశుగణన కొనసాగుతోంది. ఎన్యూమరేటర్లు ఇంటింటా తిరిగి 16 రకాల పశుజాతులకు సంబంధించిన వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతీ అంశాన్ని పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదుచేసి పారదర్శకంగా సర్వే కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 70శాతం మేర పశుగణన పూర్తయింది. ప్రభుత్వం విధించిన గడువులోగా పశుగణన పూర్తి చేస్తాం.

– కుమారస్వామి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



మండల కేంద్రంలో ఆటోర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి

కాటారం: డ్రైవర్లు, వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు సాగించాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్ రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు పోలీసులు ఆటోలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రధాన కూడలిలో రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ రూల్స్, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై ఆటోడ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్లు, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడంతో పాటు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. తమపై తమ కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారనే విషయాన్ని డ్రైవర్లు అనునిత్యం గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వరాదని.. ఏదైనా ప్రమాదానికి గురైతే వాహన యజమానులు జైలుపాలు కావాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

భూపాలపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి భూపాలపల్లి మండలం బావుసింగ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం తండాలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, రోడ్డు, రవాణా సౌకర్యాలు మెరుగుపరచడం ద్వారా వాణిజ్య కార్యకలాపాలకు కూడా మేలు జరుగుతుందన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ నారాయణ రావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ



ప్లాట్లు అందేనా..

రెండేళ్లుగా ఎదురుచూపులే..

- పట్టించుకోని జెన్‌కో, రెవెన్యూ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులు



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు



నిర్వాసితులకు ప్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలు ఇస్తున్న అధికారులు (ఫైల్)

మల్హర్: ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందక భూ నిర్వాసితులు రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. జెన్‌కో, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. తమ ప్రాంత అభివృద్ధి కోసం ఇళ్లు, జాగలను వదిలి దిక్కులేని వారిలాగా సొంత ఊళ్లోనే పరాయివారుగా నివసించాల్సి వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మల్హర్ మండలం తాడిచర్ల బ్లాకు–1 ఓపెన్ కాస్ట్ విస్తరణలో భాగంగా తాడిచర్ల గ్రామం ఎస్సీకాలనీలో 49 పైచిలుకు, కాపురం గ్రామంలో 136 ఇండ్లను జెన్‌కో సేకరించింది. సేకరించిన ఇళ్లకు పరిహారం సైతం చెల్లించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో కేటాయింపులో భాగంగా తాడిచర్ల గ్రామం ఎస్సీకాలనీలో 69మంది, కాపురం గ్రామంలో 202మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో కొందరికి పరిహారంతో పాటు ప్లాట్లను కేటాయించారు. మరికొంతమందికి మాత్రం పరిహారం అందజేసి ప్లాట్లు కేటాయించలేదు.

134మందికే నివాస స్థలాలు..

తాడిచర్ల బ్లాక్–1లో మొత్తం 271మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ఇందులో తాడిచర్ల ఎస్సీ కాలనీలో 69మంది, కాపురంలో 202మందిని పీడీఎఫ్ లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటివరకు ఎస్సీ కాలనీవాసులకు 69మందికి, కాపురంలోని 65మందికి మొత్తం 134మందికి మాత్రమే రెండు విడుతలగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇంకా కాపురం గ్రామంలోని 137మందికి ఇళ్ల స్థలాలను కేటాయించాల్సి ఉండగా పెండింగ్‌లోనే ఉన్నాయి. రెండేళ్లుగా స్థలాలను కేటాయించాలని నిర్వాసితులు కోరినా పలు కారణాలతో నెట్టుకుంటూ వస్తున్నారు. తాడిచర్ల చుట్టుపక్కల ఈ ప్యాకేజీకి అవసరమైన భూమి అందుబాటులో లేకపోవడంతోనే ఇబ్బంది ఎదురవుతుందని సదరు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో 8ఎకరాలకు పైగా ప్రైవేట్ భూమి కొనుగోలు చేసి నిర్వాసితులకు ప్లాట్లు ఇవ్వాలని చూసినా అది కార్యరూపం దాల్చలేదు.

భూమి కన్నా.. పరిహారం మిన్న..

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పెండింగ్‌లో ఉన్న 137మంది తమకు నివాస స్థలాలకు బదులు అంతమేర పరిహారం నగదు రూపంలో చెల్లించాలని కోరుతున్నారు. ఇప్పటికే చాలామంది నిర్వాసితులు ఆర్‌అండ్‌ఆర్ ద్వారా వచ్చిన డబ్బులతో వివిధ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసుకున్నారు. స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు సిద్ధమయ్యారు. గతంలో సైతం తమకు ఇళ్ల స్థలాలకు బదులు పరిహారం చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని గతంలో ఆర్డీఓకు వినతిపత్రాలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. తమ సమస్యలు దృష్టిలో ఉంచుకుని నగదు రూపంలో ఓ పరిహారం అందేలా చూడాలని నిర్వాసితులు కోరుతున్నారు.

డబ్బులు ఇవ్వాలి



కాపురం గ్రామంలో ఇళ్లు కోల్పోయాను. ఇండ్లకు డబ్బులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లించారు. సంవత్సరాలు గడుస్తున్నా ప్లాట్ మాత్రం కేటాయించలేదు. అప్పటి కలెక్టర్ ప్లాట్‌కు బదులుగా డబ్బులు ఇస్తామని చెప్పడంతో ఇతర చోట స్థలం తీసుకున్నాను. అధికారులు ప్లాట్‌కు బదులుగా డబ్బులు ఇవ్వాలి.

– ముడతనపల్లి సంపత్, తాడిచర్ల, మల్హర్

న్యాయం చేయాలి



ఓపెన్‌కాస్ట్‌లో ఇళ్లు కోల్పోయిన మాకు అధికారులు న్యాయం చేయాలి. సంవత్సరాలు గడుస్తున్నా ప్లాట్లకు సంబంధించిన అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ప్లాట్లు ఇవ్వకుండా పరిహారం ఇవ్వాలని గతంలో 30మందికి ఆర్డీఓకు వినతి పత్రాలు ఇచ్చాం. జిల్లా అధికారులు స్పందించి తమకు సత్వర న్యాయం చేయాలి

– గుమ్మడి రవి, తాడిచర్ల, మల్హర్

సబ్ డివిజన్ కార్యాలయానికి పంపిస్తాం..

కాటారం సబ్ డివిజన్‌కు సంబంధించిన భూసేకరణ ఫైళ్లను నూతన ఏర్పడిన కాటారం సబ్ కలెక్టర్ (సబ్ డివిజన్) కార్యాలయానికి పంపిస్తాం. మల్హర్ మండలం తాడిచర్ల, కాపురం గ్రామాలు భూ సేకరణకు పెండింగ్ భూసేకరణకు సంబంధించని పనులు అక్కడి నుంచి జరుగుతాయి.

– రవి, భూపాలపల్లి ఆర్డీఓ

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



పలిమెల: అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

పలిమెల: ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్‌కుమార్ అధికారులను అదేశించారు. మండల కేంద్రంలో జరుగుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, తదితర ప్రభుత్వ పథకాల సర్వే తీరును అయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో లేని వారు ఉంటే దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ అనిల్, ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాటారం: అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా సర్వే కొనసాగించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం కాటారం మండలం చింతకానిలో కొనసాగుతున్న సర్వేను సోమవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట మండల ప్రత్యేకాధికారి నరేశ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, సర్వే సిబ్బంది ఉన్నారు.



కాటారం: చింతకాని జీపీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

అర్హులకు సంక్షేమ పథకాలు

చిట్యాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి ఆమె మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయశ్రీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు గుంటూరుపల్లిలో సర్వేను పరిశీలించారు.

గ్రామసభలు విజయవంతంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్: గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గ్రామసభలు నిర్వహణపై సోమవారం ఐడీఓసీ కార్యాలయం నుంచి మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొదటిదశలో క్షేత్రస్థాయి విచారణ సజావుగా, సక్రమంగా చేశారని అదే స్ఫూర్తితో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగిన క్షేత్రస్థాయి విచారణలో భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని అభినందించారు. 21నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేయాలని ముందస్తు సమాచారం అందించి ఆహ్వానించాలని సూచించారు. గ్రామసభల ప్రారంభానికి ముందు ప్రభుత్వం నుంచి వచ్చిన సందేశాన్ని చదివి వినిపించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, భూపాలపల్లి మున్సిపాలిటీతో సహా 72 గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఆర్‌డీఓ నరేష్, డీపీఓ నారాయణరావు, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు

టేకుమట్ల: నేటి (మంగళవారం) నుంచి ఈ నెల 24వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లిలో నేడు జరుగనున్న గ్రామసభల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామసభల నిర్వహణ సమాచారాన్ని గ్రామస్తులందరికీ తెలిసేలా దండోరా వేయించాలని సూచించారు. ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారని, ఆ భూముల వివరాలను గ్రామ సభల్లో వెల్లడిస్తారని చెప్పారు. నూతన రేషన్ కార్డుల కోసం గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతరం ప్రక్రియ అని చెప్పారు. అనంతరం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సేకరించిన భూములను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత, ఆర్ఐ సంతోష్‌కుమార్, ఎంపీఓ సురేష్ పాల్గొన్నారు.



టేకుమట్ల: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

రేగొండ: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ ఒంటేరు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు రంగయ్యపల్లి ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యార్థులకు తరచుగా పరీక్షలు నిర్వహించి ఫలితాలపై సమీక్ష చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న చంద్రశేఖర్

నకిలీ పురుగు మందులు విక్రయించారని ఆందోళన



డోర్నకల్ : తమకు నకిలీ పురుగు మందులు విక్రయించారని ఆరోపిస్తూ డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో రైతులు సోమవారం ఆందోళన నిర్వహించారు. మిరప తోటల్లో నల్లతామర, ఎర్ర నల్లి నివారణకు చిలుకోడు గ్రామంలోని కృష్ణా ట్రేడర్స్ దుకాణంలో 'ఎండోఫిల్ అలక్టో' మందు కొనుగోలు చేసి పిచికారీ చేస్తే పనిచేయలేదని, ఫలితంగా పంట నష్టపోయామని పలు గ్రామాలకు చెందిన రైతులు పేర్కొన్నారు. ఈ ఘటనపై తమకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలంటూ కంపెనీ డీలర్ నాగరాజును నిలదీశారు. సమాచారం అందుకున్న ఏఓ మురళీమోహన్, డోర్నకల్, బయ్యారం సీఐలు బి.రాజేశ్, రవికుమార్, ఏఎస్సై కోటేశ్వర్‌రావు చిలుకోడుకు చేరుకుని రైతులతో మాట్లాడి సర్ది చెప్పారు. ఎండోఫిల్ కంపెనీ ఏఎఫ్ఓ తిరుపతి మాట్లాడుతూ ఒక బ్యాచ్‌కు చెందిన 'అలక్టో' మందులో తేడా ఉన్నట్లు గుర్తించామని, దీనిని కంపెనీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులు మాట్లాడుతూ పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

చిన్నారిపై లైంగిక దాడి

● యువకుడిపై పోక్సో కేసు

రఘునాథపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై మద్యం మత్తులో ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇంటి వద్ద ఉన్న చిన్నారిపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తి.. ప్రారంభంకాని నిర్మాణ పనులు

● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
● మళ్లీ వరద తిప్పలు తప్పవంటున్న ప్రజలు
● పనులకు సంబంధించిన శిలాఫలకం ధ్వంసం

కొండాయి బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

కూలిపోయిన కొండాయి బ్రిడ్జి



ఏటూరునాగారం: కొండాయి జంపన్న వాగు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభంకావడం లేదు. దీంతో మళ్లీ వరద తిప్పలు తప్పవని ఏజెన్సీ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు 2023 జూలై 27వ తేదీన మండలంలోని కొండాయి, మల్యాల గ్రామాలు వరదలో మునిగిపోయాయి. ఇదేక్రమంలో కొండాయి–దొడ్ల గ్రామాల మధ్యలోని హైలెవల్ బ్రిడ్జి కొట్టుకుపోయింది. ఈ ఘటనలో 8 మంది వరదలో చిక్కుకుని మృతి చెందారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొండాయి, లోతట్టు గ్రామాల ప్రజలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని పలువురు అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. దీంతో రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క గతేడాది మార్చి 16వ తేదీన రూ.9.50కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేసి పది నెలలు పూర్తయినా పనుల్లో ఎలాంటి కదలికలు లేవు. ఇదిలా ఉండగా ఈ వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించారు. అయితే ఐదు నెలలు దాటితే వర్షాకాలం కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో మళ్లీ వర్షాలు కురిసి ప్రస్తుత తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయే అవకాశాలున్నాయి. ఫలితంగా గిరిజన పల్లెలకు కష్టాలు తప్పేలా లేవని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే కొండాయి, మల్యాలతోపాటు ఐలాపురం గ్రామస్తులకు కూడా మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. కాగా, బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకం ధ్వంసమైంది. పనుల్లో ఎలాంటి కదలికలు లేవని ఉద్దేశంతో దీనిని ధ్వంసం చేశారా లేక యాదృచ్ఛికంగా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మినీ జాతరకు ఈ రోడ్డేనా?

ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు ఈ మట్టి రోడ్డే దిక్కయ్యేలా ఉంది. మేడారంతోపాటు ఐలాపురం, కొండాయిలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రైవేటు వాహనాలు వస్తాయి. దీంతో వాహనదారులకు మట్టి రోడ్డుతో సమస్యలు, ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి. సింగిల్ లేన్‌గా ఉన్న మట్టి రోడ్డు వల్ల వాహనాలు ఎదురైతే వాగులో పడిపోయే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. దీనిపై రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు దృష్టిసారించాలని పలువురు ఏజెన్సీ వాసులు పేర్కొంటున్నారు.



కొండాయి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి

కొండాయి వద్ద కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి. బ్రిడ్జి లేకపోవడంతో ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. వాహనదారులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి.

-మల్లెల లక్ష్మయ్య, మాజీ సర్పంచ్, ఐలాపురం



జాతర కోసం రోడ్లు అభివృద్ధి చేయాలి

కొండాయి, ఐలాపురం రోడ్లు మరింత అభివృద్ధి చేయాలి. మినీ మేడారం జాతరతోపాటు కొండాయి, ఐలాపురంలో కూడా జాతర జరుగుతుంది. ఈనేపథ్యంలో భక్తుల కోసం రోడ్లు మరింత అభివృద్ధి చేయాలి.

-కాక వెంకటేశ్వర్లు , మాజీ సర్పంచ్

రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా డీసీసీబీ



దశాబ్ది డిపాజిట్ పథక కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, డైరెక్టర్లు

● రూ.2,100 కోట్ల టర్నోవర్‌తో అగ్రస్థానం
● డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

హన్మకొండ : రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) నంబర్ వన్‌గా ఉందని ఆ బ్యాంకు చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు పేర్కొన్నారు. సోమవారం నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో డీసీసీబీ మహాజన సభ జరిగింది. ఈ సభలో చైర్మన్ రవీందర్ రావు మాట్లాడారు. పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పుడు రూ.885 కోట్ల టర్నోవర్..ఇప్పుడు రూ.2,100 కోట్లకు చేరుకుందని వివరించారు. పంట రుణాలు రూ.372 కోట్ల నుంచి రూ.600 కోట్లకు, ఎల్‌టీ రుణాలు రూ.150 కోట్ల నుంచి రూ.342 కోట్లకు పెరిగాయని వెల్లడించారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టి రూ.118 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. నాబార్డు సాయంతో 50 ప్రాథమిక సహకార సంఘాలను మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేశామన్నారు. రైతుల పిల్లలు విదేశీ విద్య అభ్యసించేందుకు రుణాలు అందించామని వివరించారు. ప్రతీ మండలంలో డీసీసీబీ బ్రాంచీ ఏర్పాటుకు రిజర్వు బ్యాంకుకు ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీ ఏ–గ్రేడ్ సర్టిఫికెట్ అందుకుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టి కరపత్రాలు ఆవిష్కరించారు.

నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు వడ్డీతో ఖర్చుల చెల్లింపు

డీసీసీబీలో ఖాళీగా ఉన్న భవన సముదాయాన్ని అద్దెకు ఇచ్చిన అంశంలో కొంత ఉపశమనం లభించింది. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసినందుకు అయిన ఖర్చులను వడ్డీతో సహా చెల్లించాలని కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు డీసీసీబీ పాలక వర్గం ఏడుగురు డైరెక్టర్లతో ప్రత్యేక కమిటీ వేసింది. నల్లవెల్లి కన్‌స్ట్రక్షన్స్‌కు రెండు వాయిదాలో మొత్తం రూ.3,23,93,099 డీసీసీబీ చెల్లించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ తీర్మానాన్ని సోమవారం వరంగల్ డీసీసీబీ మహాజన సభలో ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది.

అధికారుల తీరుపై ఆగ్రహం..

జిల్లా సహకార అధికారుల తీరుపై డీసీసీబీ డైరెక్టర్లు, సంఘాల చైర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో చెప్పారని తమపై కక్షసాధింపు, కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రైతులకు సహకరించి ధాన్యం తరలిస్తే రవాణా ఖర్చులు ఎలా చూపెడతారని జిల్లా సహకార అధికారి తమపై చర్యలు తీసుకోవాలని చూస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ మండిపడ్డారు. మరో డైరెక్టర్ చెట్టుపల్లి మురళీధర్ తమ సొసైటీపై కుట్రలకు పాల్పడుతున్నారని, నాచినపల్లి సొసైటీపై చర్యలు తీసుకుంటే కోర్టుకు వెళ్తామని వరంగల్ డీసీఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ఇతర సంఘాల చైర్మన్లు మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఎండీ వజీర్ సుల్తాన్, జిల్లా సహకార అధికారులు, డీసీసీబీ డైరెక్టర్లు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యుఒడికి..

● అదుపు తప్పి పల్టీకొట్టిన కారు.. విద్యార్థి మృతి
● ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలు
● పెంబర్తి వై జంక్షన్ సమీపంలో ఘటన



పల్టీకొట్టిన కారు



సిద్ధారెడ్డి(ఫైల్)

జనగామ : స్నేహితుడి ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి ఆరుగురు విద్యార్థులు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృత్యుఒడికి చేరగా, ఒకరికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున జనగామ జిల్లా పెంబర్తి వై జంక్షన్ సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాపల్లికి చెందిన విద్యార్థి పెద్దపల్లి అభిచరణ్, పోలీసుల కథనం ప్రకారం.. ఆముదాలపల్లికి చెందిన పెద్దపల్లి అభిచరణ్, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నెంపల్లికి చెందిన బండ గణేశ్, ఇదే జిల్లా మెట్‌పల్లికి చెందిన తోట అక్షిత్, బహదూర్‌పురా మండలం అంబర్‌పల్లికి చెందిన గుజ్జుల నందు, కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లన్నపల్లెకు చెందిన కన్నివేని అంజి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కురికిశాల గ్రామానికి చెందిన బద్దం సిద్ధారెడ్డి(20) స్నేహితులు. ఇందులో సిద్ధారెడ్డి హనుమకొండలోని వాగ్దేవి, మిగతా వారు వివిధ కళాశాలల్లో చదువుకుంటున్నారు. హైదరాబాద్‌లోని తమ స్నేహితుడి ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆరుగురు ఆదివారం అర్ధరాత్రి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ సమీపంలో కారు అదుపు రోడ్డు పక్కన గుంతలోకి పల్టీలు కొట్టింది. దీంతో కారు డోర్ ఊడిపోవడంతో సిద్ధారెడ్డి బయటకు ఎగిరి పడగా అంజికి తీవ్రగాయాలయ్యాయి. మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అక్షిత్ వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, సిద్ధారెడ్డి మార్గమధ్యలోనే మృతి చెందాడు. అంజి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు తరలించారు. ఎస్సై రాజన్‌బాబు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేశారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

కారు ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు జనగామ జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మహేందర్‌రెడ్డి, లావణ్య దంపతులకు సిద్ధారెడ్డితో పాటు కూతురు ఉంది. సిద్ధారెడ్డిని హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో చదివిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో సిద్ధారెడ్డి మృతి చెందడంతో కొడుకుపైనే ఆశలుపెట్టుకున్న ఆ తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగారు. కుమారుడి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు. సిద్ధారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా..

● డ్రైవర్ మృతి.. మొట్లగూడెంలో ఘటన
● మృతుడిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా



ప్రశాంత్ మృతదేహం

మంగపేట : అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన ఆదివారం రాత్రి ములుగు జిల్లా మంగపేట మండలం మొట్లగూడెం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ముత్యాలమ్మపేటకు చెందిన ప్రశాంత్ (25) ములుగు జిల్లా మంగపేట మండలం నర్సింహాసాగర్ గ్రామంలోని రైతు తాటి సమ్మయ్యకు చెందిన జామాయిల్ కలప ను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. మొట్లగూడెం సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రశాంత్ ట్రాక్టర్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై టీవీఆర్ సూరి ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సోమవారం మృతదేహాన్ని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తాత రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి నాగమణి, తమ్ముడు రాంపండు ఉన్నారు.

బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్ట్

● రూ.8.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న దంపతులను అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. వీరినుంచి సుమారు రూ.8.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం హనుమకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటారం గ్రామానికి చెందిన దంపతులు మద్దూరి సత్యనారాయణ, చెల్ల స్వప్న హనుమకొండ కుమార్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. సత్యనారాయణ కుల వృత్తి చేస్తుండగా, స్వప్న ఇంటి వద్దే ఉంటుంది. సత్యనారాయణకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా గతేడాది హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ, వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాలను స్వప్న చోరీ చేసి భర్తకు అందజేసింది. డిసెంబర్‌లో మరోసారి హనుమకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఇద్దరు మహిళల మెడల్లో, సైడు బ్యాగులో బంగారు ఆభరణాలను చోరీ చేశారు. వరుస చోరీలపై అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో చోరీ చేసిన సొత్తును విక్రయించడానికి హనుమకొండ టైలర్స్ స్ట్రీట్ నుంచి వెళ్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఈ దంపతులపై అనుమానం వచ్చింది. తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించడంతో అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, ఎస్సైలు అశోక్ కుమార్, కిశోర్, ఏఎ సల్మాన్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ, రాహుఫ్, కానిస్టేబుళ్లు మహేశ్, అశోక్, వీరన్న,భాస్కర్‌ను ఏసీపీ అభినందించారు.

కడుపు కోత మిగిల్చారు..

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలిసితెలియని వయసుతోపాటు కుటుంబీకులు మందలించారని, తమ ఇష్టాలకు అడ్డు చెప్పారనే కారణంతో క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడి కన్న వారికి కడుపు కోత మిగిల్చారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

తిన్న ప్లేట్ కడగలేదని తల్లి మందలించడంతో..



శ్రావణి(ఫైల్)

కురవి: తిన్న ప్లేట్ కడగలేదని తల్లి మందలించడంతో క్షణికావేశానికి గురైన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. కురవి మండలం నేరడ శివారు కాకులబోడు తండా గ్రామానికి చెందిన బానోత్ వెంకన్న కుమార్తె శ్రావణి (14) తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 17వ తేదీన భోజనం చేసిన ప్లేట్ కడగలేదని తల్లి సరిత.. శ్రావణిని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రావణి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన తల్లిదండ్రులు అదే రోజు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ధరణి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ సోమవారం తెలిపారు. కాగా, శ్రావణి మృతితో కుటుంబంతోపాటు తండాలో విషాదం అలుముకుంది.

ప్రేమించిన యువతితో పెళ్లి చేయడం లేదని యువకుడు..



భరత్ (ఫైల్)

మొగుళ్లపల్లి : ప్రేమించిన యువతితో తనకు పెళ్లి చేయడం లేదనే కారణంతో కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంగ భరత్‌కుమార్ (20) ఓ యువతిని ప్రేమిస్తున్నానని, ఆమెతోనే పెళ్లి జరిపించాలని తండ్రితో మూడు రోజుల నుంచి గొడవ పడుతున్నాడు. అయితే తల్లి సంవత్సరీకం కాగానే పెళ్లి విషయంపై మాట్లాడుదామని చెప్పినా వినకుండా ఆదివారం రాత్రి వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగానని కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించగా అదేరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ప్రేమ విఫలమై మరో యువకుడు..

కాటారం : ప్రేమ విఫలమై ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మహాముత్తారం మండలం సింగారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాసం మహేశ్(24) కొన్ని సంవత్సరాలుగా వాజేడు మండలం ముళ్లకట్ట రాంపూర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్ని రోజుల క్రితం యువతి ప్రేమ విషయం ఇంట్లో తెలపగా కుటుంబ సభ్యులు పెళ్లికి ఒప్పుకోలేదు. ఈ విషయం సదరు యువతి మహేశ్‌కు తెలపడంతో మనోవేదనకు గురై ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు.

నెల్లుట్లలో ఎనిమిదో తరగతి విద్యార్థి..



లక్ష్మణ్ మృతదేహం

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్లకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి దీకొండ లక్ష్మణ్ (13) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం..లక్ష్మణ్‌తో పాటు మరో నలుగురు స్నేహితులు కలిసి బడికి వెళ్లేవారు. సోమవారం ఓ స్నేహితుడి ఫోన్ తన వద్దే పెట్టుకొని, తాను చనిపోతానంటూ మిగతా స్నేహితులకు మెసేజ్‌లు చేసినట్లు సమాచారం. దీంతో ఓ స్నేహితుడు ఫోన్ చేస్తే ఎంతకూ లక్ష్మణ్ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే అతడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. లక్ష్మణ్ మృతితో తల్లిదండ్రులు దీకొండ లక్ష్మి, సత్తయ్య రోదనలు మిన్నంటాయి. కాగా, లక్ష్మణ్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక



దేవకికి స్వీటు తినిపిస్తున్న అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్ : కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో ఈ నెల 28నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఆల్ ఇండియా పాఠశాల క్రీడల సమాఖ్య జిమ్నాస్టిక్స్ పోటీలకు కందికొండ దేవకి ఎంపిక కాగా హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ సోమవారం అభినందించారు. ఇటీవల హైదరాబాద్ సరూర్ నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో దేవకి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది. దేవకిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూ నాయక్, జిమ్నాస్టిక్స్ కోచ్ నరేందర్ తదితరులు అభినందించారు.

రెండు కిలో మీటర్లు.. మూడున్నర గంటలు

మాదిగల్లో ఉత్తేజం నింపిన మహాప్రదర్శన

● డప్పుచప్పుళ్లు, పాటలతో కదం తొక్కిన కార్యకర్తలు
● వర్గీకరణను అడ్డుకుంటున్న వారిని ఎదుర్కోవాలి
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మహాప్రదర్శనలో డప్పు కొడుతున్న మంద కృష్ణ మాదిగ



డప్పులతో సాగుతున్న మహాప్రదర్శన

హన్మకొండ: రెండు కిలో మీటర్లు.. మూడున్నర గంటలు.. హనుమకొండలో నిర్వహించిన లక్ష డప్పులు, వేల గొంతుకుల సన్నాహక మహాప్రదర్శన ఉత్తేజం నింపింది. సోమవారం హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు, కళాకారులు పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12.30 గంటలకు మహా ప్రదర్శన ప్రారంభించారు. వేయి స్తంభాల దేవాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం మూడున్నర గంటల పాటు మహాప్రదర్శన సాగింది. దారి పొడవునా మంద కృష్ణతోపాటు, ఆయా పార్టీల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కళాకారులు తరలివచ్చిన డప్పులు వాయిస్తూ, పాడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ, నాయకులు, కళాకారులు.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ప్రదర్శన విజయవంతం కావడంతో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ శ్రేణులతోపాటు మాదిగ జాతిలో ఆనందం నెలకొంది. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు.. వేల గొంతుల మహా ప్రదర్శనకు కార్యోణ్ముకులయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 30 వేలకు పైగా తరలివెళ్లనున్నట్లు వక్తలు చెప్పారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణను అడ్డుకుంటున్న వివేక్ కుటుంబాన్ని ఎదుర్కోవాల్సిన బాధ్యత ప్రతీ మాదిగ బిడ్డపై ఉందన్నారు. ధర్మం, న్యాయం, సమాజం, పార్టీలు, ప్రధాన మంత్రితో సహా అందరుమాదిగల పక్షాన, వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకుంటే ఆయనను శత్రువుగా చూడమన్నారు. అయితే వర్ధన్నపేట ఎమ్మెల్యేతో సహా మాల ఎమ్మెల్యేలు, ఎంపీలను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి ప్రతీ మాదిగ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్, ఆయా పార్టీలు, ఆయా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు గోనె ప్రకాశ్ రావు, పృథ్వీరాజ్, నమిండ్ల శ్రీనివాస్, గిద్దె రాంనర్సయ్య, గంగ, వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, దరువు ఎల్లన్న, రాంబాబు, అమూల్య, నలిగంటి శరత్, స య్యద్ ఇస్మాయిల్, మాట్ల తిరుపతి, బుర్ర సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల ఆలయంలో పూజలు



ఆలయంలో దప్పుతో మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే రమేశ్ తదితరులు

హన్మకొండ కల్చరల్ : ప్రదర్శనకంటే ముందుగా వేయిస్తంభాల దేవాలయాన్ని మంద కృష్ణ మాదిగ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, గాయకుడు మిట్టపల్లి సురేందర్ తదితరులు సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వద్ద డప్పులు ఉంచి పూజలు చేశారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి మనసు కరిగి ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే శాసన సభలో ఆమోదించేలా రుద్రేశ్వరుడు కరుణించాలని తాము కోరుకున్నామని తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు ఉపేంద్రశర్మ వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం అందజేశారు.